సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । 14 । మే । 2023



లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం సులభం

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం సులభతరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి అన్నారు. -8లో..



ఒకే రాత్రి నాలుగు దుకాణాల్లో చోరీ

మైదుకూరు పట్టణంలో ఒకే రాత్రి నాలుగు దుకాణాల్లో చోరీ జరిగింది. దీంతో వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. -8లో..



ప్రాణం తీసిన ఈత సరదా

లింగాల మండలం పార్నపల్లెకు చెందిన ఇద్దరు చిన్నారులు అనంతపురం జిల్లా యల్లనూరు మండలం శింగవరం గ్రామంలో ఈతకు వెళ్లి మృతి చెందారు. -8లో..

పాఠశాల తెరిచిన రోజే 'జగనన్న విద్యా కానుక'

జిల్లా కలెక్టర్ విజయరామరాజు

చింతకొమ్మదిన్నె : విద్యార్థులకు పాఠశాల తెరిచిన రోజే జగనన్న విద్యా కానుక అందజేస్తామని జిల్లా కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. శనివారం మండలంలోని సీకే దిన్నె జిల్లా పరిషత్ హైస్కూలులోని జగనన్న విద్యా కానుక మండల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక ద్వారా విద్యార్థులకు ఇవ్వబోయే యూనిఫాం, బ్యాగు, బెల్ట్, షూ ముందస్తుగా పరిశీలించి నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 1,58,157 మంది విద్యార్థులకు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠశాల తెరిచిన రోజే విద్యా కానుక కిట్లు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, మండల విద్యాశాఖాధికారి వెంకట్రామిరెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి దశరథరామిరెడ్డి, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



జగనన్న విద్యాకానుక మండల స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు

నాడు–నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలి

మన బడి నాడు–నేడు కింద రెండోదశలో జరుగుతున్న అభివృద్ధి పనులను పాఠశాలల తెరిచే నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. శనివారం మండలంలోని జమాల్‌పల్లి, జె-కొత్తపల్లి గ్రామాల్లో రూ. 2.5 కోట్లతో నిర్మిస్తున్న 19 అదనపు గదులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1006 ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లతో పాటు జూనియర్ కళాశాలలో రూ.290 కోట్లతో మన బడి, నాడు–నేడు రెండో దశ పనులు జరుగుతున్నాయని, వీటిని నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, ఆర్డీవో ధర్మ చంద్రారెడ్డి, డీఈవో రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమ్మర్ స్పెషల్ బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ సెలవులను దృష్టిలో పెట్టుకుని పలు ప్రముఖ, పర్యాటక, పుణ్యక్షేత్రాలకు బస్సులను నడపనున్నట్లు కడప రీజినల్ మేనేజర్‌గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అరకోణం, కంచిగుడి, మైలాదుర్లై, చిదంబరం, నాగపట్నం, వేలాంగిణి, నాగూరు దర్గాకు ప్రతి శుక్రవారం రాత్రి 8 గంటలకు కడప నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరతాయన్నారు. ఈ బస్సులో పెద్దలకు రూ. 2200, చిన్న పిల్లలకు రూ. 1100 ఛార్జిగా నిర్ణయించారన్నారు. అలాగే కడప నుంచి అరుణాచలంకు సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం కలదన్నారు. పెద్దవారికి రూ. 1050, చిన్నపిల్లలకు రూ. 525 ఛార్జిగా నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఊటీకి సూపర్ లగ్జరీ సర్వీసు ఏర్పాటు చేశామని, గోవాకు ఇంద్ర ఏసీ సర్వీసు నడుపుతున్నామని తెలిపారు.

సదాశివరాయల కాలంనాటి బావి గుర్తింపు



సదాశివరాయల కాలం నాటి బావి ఆనవాళ్లు

మైదుకూరు : మైదుకూరు మండలం తిప్పిరెడ్డిపల్లె ప్రాంతంలో విజయనగర రాజులలో ఒకరైన సదాశివరాయల కాలం నాటి బావిని కనుగొన్నట్లు మైదుకూరుకు చెందిన పరిశోధకుడు బొమ్మిశెట్టి రమేష్ శనివారం తెలిపారు. తిప్పిరెడ్డిపల్లె చెరువు పైభాగంలోని వంకల సమీపంలో దీనిని కనుగొన్నట్లు చెప్పారె. బావి సమీపంలో సదాశివ రాయుల కాలం నాటి ఆవాసాలను కూడా గుర్తించినట్లు తెలిపారు. బావి, నివాసాల ఛాయా చిత్రాలను భారత పురావస్తు పరిశోధకశాఖ డైరెక్టర్ మునిరత్నం రెడ్డికి పరిశీలనకు పంపగా ఆయన వాటిని 16వ శతాబ్దం నాటి సదాశివ రాయల కాలంలోని బావి, నివాస ఆనవాళ్లేనని ధ్రువీకరించినట్లు వివరించారు.

యువకుడి ఆత్మహత్య

పోరుమామిళ్ల : పట్టణంలోని కొత్తవీధికి చెందిన జింకతోటి ప్రసాద్ కుమారుడు భాను ప్రసాద్ (21) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ హరిప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. భానుప్రసాద్ నాలుగేళ్ల క్రితం ఓ హిజ్రాతో ప్రేమలో పడి పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరూ పట్టణంలోని కొత్తవీధిలో కాపురం పెట్టారు. భాను ప్రసాద్ గిరినగర్‌కు చెందిన ఎస్సీల అబ్బాయి. అతను హిజ్రాతో ప్రేమలో పడటం ఏ మాత్రం నచ్చని తల్లిదండ్రులు దూరం పెట్టినట్లు తెలుస్తోంది. అతను మహబూబ్‌నగర్ కాలనీలోని మైదుకూరు రోడ్డులో ఓ ఆటో మెకానిక్ షాపులో పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం అతను పెండ్లి చేసుకున్న హిజ్రా (మౌనిక) అతన్ని విడిచి ప్రొద్దుటూరు పోయిందని, అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయి, అతిగా మద్యం సేవిస్తున్నట్లు తెలిసింది. శుక్రవారం రాత్రి కూడా మద్యం మత్తులో పడిపోగా స్నేహితులు ఇంటికి చేర్చినట్లు సమాచారం. శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో అతను ఇంటిలో ఉరి వేసుకుని ఉండటం గమనించిన వారు ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చారు. విషయం పోలీసులకు తెలియడంతో ఎస్ఐ హరి ప్రసాద్ సిబ్బందితో వచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై కత్తితో దాడి


చికిత్స పొందుతున్న సాయి కిరణ్ రాజు

చింతకొమ్మదిన్నె : ఇందిరానగర్ వద్ద సాయి కిరణ్ రాజు అనే యువకునిపై పవన్ కుమార్ అనే యువకుడు కత్తితో దాడి చేసి గాయపరిచినట్లు సీకేదిన్నె ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఇందిరానగర్ గ్రామానికి చెందిన సాయి కిరణ్ రాజు, పవన్ కుమార్‌లు కొద్ది రోజుల క్రితం కడప నగరంలోని ఐటీఐ సర్కిల్ వద్ద ఓ యువతి విషయమై వాదులాడుకున్నారు. ఈ నేపథ్యంలో రిమ్స్‌లో ఔట్ సోర్సింగ్ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న సాయి కిరణ్ రాజు శనివారం రాత్రి విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా ఈ దాడి జరిగింది. దాడికి పాల్పడిన పవన్ కుమార్ పారిపోయాడు. గాయపడిన సాయి కిరణ్‌ను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం సులభం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి
- జిల్లాలో ఇప్పటివరకు 12876 కేసుల పరిష్కారం, కక్షిదారులకు రూ.2,36,42,291 నష్టపరిహారం




మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి, పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు

కడప అర్బన్ : జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం సులభతరమని, సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి అన్నారు. జాతీయ న్యాయసేవాధికారసంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం కడపలోని న్యాయసేవాసదన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 22 బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. 33,743 కేసులు పెండింగ్‌లో వున్నాయన్నారు. జాతీయలోక్ అదాలత్‌లో న్యాయమూర్తులతోపాటు న్యాయవాదులు, పోలీసులు, వివిధ శాఖల అధికారులు పాలు పంచుకునేలా ఎప్పటికపుడు సమావేశాలను నిర్వహించి తమ వంతుగా కృషి చేశామన్నారు. జాతీయ లోక్ అదాలత్‌కు వచ్చిన కక్షిదారుల కోసం ఎస్‌బిఐ వారి సౌజన్యంతో అన్నప్రసాదాన్ని అందజేశారు. కాగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 12876 కేసులను పరిష్కరించారు. కక్షిదారులకు 2,36,42,291 నష్టపరిహారంగా చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, లోక్ అదాలత్ సభ్యులు, కక్షిదారులు, వారి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి వారి కేసులను పరిష్కరించుకోవడం జరిగింది. కోవిడ్ -19 నియమావళిని అనుసరిస్తూ జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ప్రత్యేకంగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ప్రదీప్‌కుమార్‌తో పాటు న్యాయమూర్తులు మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సీ.ఎస్. మూర్తి, నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గీతా, ప్రిన్సిపల్ సీనియర్ సీవిల్ జడ్జి కవిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రసూన, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి భార్గవి, కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జీ.వి రాఘవరెడ్డిలు పాల్గొన్నారు.

గోలిసోడాలో బొద్దింక కలకలం

చక్రాయపేట : చక్రాయపేటలోని ఓ కూల్‌డ్రింక్స్ షాపులో విక్రయిస్తున్న గోలి సోడాలో బొద్దింక కనిపించింది. ఈ విషయాన్ని యజమాని హిదయతుల్లా గుర్తించారు. వెంటనే ఆ సోడాలను విక్రయించకుండా పక్కన పెట్టేశారు. సోడాలను అందించిన కంపెనీకి ఫిర్యాదు కూడా చేశారు. సోడాలో బొద్దింక కనిపించడంతో స్థానికంగా కలకలం రేగింది. ఈ విషయంపై పోలీసులు, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఒకే రాత్రి నాలుగు దుకాణాల్లో చోరీ

మైదుకూరులో బెంబేలెత్తుతున్న వ్యాపారులు



మొబైల్ దుకాణంలో క్యాష్ పెట్టె తెరిచి ఉంచిన దృశ్యం, సీసీ ఫుటేజీల్లో నిక్షిప్తమైన దృశ్యాలు

మైదుకూరు : మైదుకూరు పట్టణంలో ఒకే రాత్రి నాలుగు దుకాణాల్లో చోరీ జరగడంతో వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలోని బద్వేలు రోడ్డులో రెండు మెడికల్ షాపులు, ఓ బేకరి, ఓ మొబైల్ షాపులో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. రూ.50 వేల నగదు, రూ.25 వేల విలువైన సెల్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. దుకాణాల సెట్టర్లకు వేసి ఉన్న తాళాలను పగులగొట్టి చోరీకి పాల్పడినట్టు బాధితులు తెలిపారు. బద్వేలు రోడ్డులోని లక్ష్మీగణపతి మెడికల్స్ షాపులో రూ.6,800 నగదు చోరీకి గురైనట్టు దుకాణం యజమాని రఘు తెలిపారు. ఆర్కాట్ లక్ష్మీ బేకరిలో రూ.3,500 నగదు ఎత్తుకెళ్లినట్లు బేకరి యజమాని శివ తెలిపారు. మహా మొబైల్స్ షాపులో రూ.19,000 నగదు, రూ.9 వేల విలువైన కొత్త సెల్‌ఫోన్, రూ.15 వేల విలువ చేసే రెండు రిపేరికి వచ్చిన సెల్‌ఫోన్లు, రూ.2 వేల విలువైన ఇయర్ బడ్స్ దుండగులు ఎత్తుకెళ్లినట్లు షాపు యజమాని బాబు పేర్కొన్నారు. సాయి అపోలో మెడికల్స్‌లో రూ.26 వేల నగదు పోయినట్లు యజమాని ప్రతాప్ తెలిపారు. దొంగతనం జరిగిన దుకాణాలు వంద మీటర్ల పరిధిలో దగ్గర దగ్గరగా ఉన్నాయి.

దొంగ చేతిపై 'రావణ్' టాటూ

దొంగతనం జరిగిన దుకాణాల్లో మహా మొబైల్స్, ఆర్కాట్ లక్ష్మీ బేకరి దుకాణాల్లో దుండగుడు నగదు చోరీ చేయడం సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. మహా మొబైల్స్ దుకాణంలో సెల్‌ఫోన్ తీసుకుంటున్న సమయంలో మొహానికి రుమాలు కట్టుకున్న దుండగుడి ఎడమ చేయి మోచేతి కింద ఇంగ్లిషులో 'రావణ్' అనే పేరును టాటూగా వేయించుకున్నట్టు కనిపించింది. నాలుగు దుకాణాల్లో అర్ధరాత్రి 12.30 గంటల నుంచి 1.40 గంటల లోపు చోరీకి పాల్పడినట్టు సీసీ పుటేజీల వల్ల తెలుస్తోంది. పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఏప్రిల్ 30న రాత్రి షేక్ షాకీర్‌హుసేన్ ఇంటిలో తలుపులు పగలగొట్టిన దుండగులు బంగారు, వెండి వస్తువులతోపాటు నగదు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. రెండు వారాల్లోనే పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాల్లో సెట్టర్ల తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడిన సంఘటన జరగడంతో వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో బేకరీ షాపు దగ్ధం


కాలిపోయిన సామగ్రి

చెన్నూరు : చెన్నూరు కొత్తరోడ్డు జాతీయ రహదారిపై శనివారం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బేకరీ షాపు పూర్తిగా దగ్ధమైంది. దీంతో షాపు యజమాని గుద్దేటి తిరుపతయ్య(లడ్డు బాబు) రూ.30 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు వాపోయాడు. బాధితుని కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతయ్య ఆరేళ్ల నుంచి బేకరి షాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజూలాగే శుక్రవారం రాత్రి 9 గంటలకు షాపు మూసేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత తమ షాపులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయని తెలియడంతో కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. ఈ విషయం అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయడంతో వారు వచ్చి మంటలను ఆర్పి వేయడం జరిగింది. అయితే అప్పటికే బేకరి షాప్ అంతా తగలబడి పోయింది. అందులోని యంత్ర సామగ్రితో పాటు భూమి పాస్ పుస్తకాలు, డాక్యుమెంట్లు, పలు సర్టిఫికెట్లు, స్వీట్స్ తయారీలో వాడే సామగ్రి పూర్తిగా కాలిపోయింది. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ తనకున్న నలుగురు కుమార్తెలలో ఒక కుమార్తె వివాహం కోసం బంగారు కొనుగోలుకు తెచ్చుకున్న 10 లక్షల రూపాయలు కూడా కాలి బూడిద అయినట్లు వాపోయాడు. సోమవారం బంగారు కొనుగోలు చేద్దామనుకున్నానని, ఆ లోపల ఈ దుర్ఘటన సంభవించిందని బాధిత కుటుంబం బోరున విపించింది. అలాగే ఈ బేకరీ షాపు పక్కన ఉన్న ఓబులేసు అనే వ్యక్తికి చెందిన కూల్ డ్రింక్ షాప్‌లో కూడా మంటలు వ్యాపించి లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లింది. సంఘటనా స్థలాన్ని ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ శనివారం ఉదయం పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయాన్ని బాధితుడిని అడిగి తెలుసుకున్నాడు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. అలాగే రెవెన్యూ అధికారులు కాలిపోయిన షాపులను పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ, వీఆర్వో, వీఆర్ఏ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి భార్య, భర్తకు తీవ్ర గాయాలు

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో శనివారం తెల్లవారుజామున గ్యాస్ సిలిండర్ పేలిన సంఘటనలో భార్య, భర్తకు తీవ్ర గాయాలైన సంఘటన జమ్మలమడుగు మండలంలో చోటు చేసుకొంది. బంధువులు, స్థానికులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.ఉప్పలపాడు గ్రామానికి చెందిన సాత్రి జేమ్స్, సాత్రి మరియమ్మ దంపతులు ఎస్సీ కాలనీలో కాపురం ఉంటున్నారు. శుక్రవారం భోజనం చేసిన తరువాత ఇంట్లో నిద్రపోయారు. తెల్లవారుజామున లేచి తలుపులు తెరచి ఇంటిలోని బల్బును వేశారు. అప్పటికే గ్యాస్ లీక్ కావడంతో.. వెంటనే మంటలు వ్యాపించి సిలిండర్ పేలింది. దీంతో వారిద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. ఇల్లు, సామగ్రి దెబ్బతింది. దాదాపు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు వారి కుమారులు తెలిపారు. ఇరువురు కూలీ పనులు చేసుకొని జీవనం సాగించేవారు. ఆ సమయంలో ఇద్దరు కుమారులు పక్కనే ఉన్న మరో ఇంటిలో ఉన్నారు. గాయాలపాలైన ఇరువురిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లాలని డాక్టర్లు సూచించడంతో కర్నూలుకు తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- ఇద్దరు చిన్నారులు మృతి
- రెండు కుటుంబాల్లో విషాదం


మృతదేహాలను వెలికితీస్తున్న ఈతగాళ్లు



మృతి చెందిన చరణ్‌కుమార్, కుశ్వంత్



లింగాల : ఈత సరదా ఇద్దరు చిన్నారుల ప్రాణం తీసింది. రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. లింగాల మండలం పార్నపల్లె గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు అనంతపురం జిల్లా యల్లనూరు మండలం శింగవరం గ్రామంలో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. యల్లనూరు ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శింగవరం గ్రామానికి చెందిన కుళ్లాయప్ప నూతన గృహ ప్రవేశ కార్యక్రమం శనివారం ఉదయం జరిగింది. లింగాల మండలం పార్నపల్లికి చెందిన పేతూరు భార్య ముక్తాపురం అంజనమ్మ తన ఇద్దరు కుమారులతో పాటు, రవీంద్రబాబు భార్య సాకేవాళ్ల గంగాదేవి తన ఇద్దరు కుమారులతో కార్యక్రమానికి హాజరయ్యారు. మధ్యాహ్నం భోజనం చేశాక పేతూరు పెద్ద కుమారుడు కుశ్వంత్ (8), రవీంద్రబాబు చిన్న కుమారుడు శివచరణ్ (13) గ్రామ సమీపంలోని పీబీసీ కెనాల్‌లో ఈత కొడదామని వెళ్లారు. కెనాల్‌లో నీరు ఉధృతంగా పారుతోంది. ఆ నీటిలో దిగిన చిన్నారులు ఈత రాకపోవడంతో లోతట్టు ప్రాంతంలో నీట మునిగిపోయారు. ఆ సమయంలో చుట్టుపక్కల ఎవ్వరూ లేకపోవడంతో వారిని గమనించలేదు. కొంతసేపటి తర్వాత ఇంటి వద్ద కుశ్వంత్, శివచరణ్ కనిపించడం లేదని తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. అలా వెతుక్కుంటూ కెనాల్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ కుశ్వంత్, శివచరణ్ విగతజీవులై నీటిలో తేలియాడుతూ కనిపించారు. ఈతగాళ్లు వచ్చి మృతదేహాలను బయటకు తీశారు. 'దేవుడా ఎంత పని చేశావయ్యా.. ముక్కుపచ్చలారని పిల్లలను తీసుకెళ్లిపోయావా' అంటూ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. బంధుమిత్రులు సైతం పిల్లలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు చిన్నారులు అక్కాచెల్లెళ్ల పిల్లలు కావడంతో ఆ కుటుంబాలు, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఆకతాయిల చర్యలతో చెట్టు దగ్ధం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వల్లూరు : ఆకతాయిల చర్యలతో వేప చెట్టు దగ్ధమైంది. కడప – తాడిపత్రి ప్రధాన రహదారి నుంచి వల్లూరు గ్రామంలోకి వెళ్లే దారిలో వున్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద కూర్చున్న గుర్తు తెలియని ఆకతాయిలు శనివారం బీడీ లేక సిగరెట్ తాగి పడవేశారు. ఇది సమీపంలో వున్న చెత్తకు అంటుకుని మంటలు రేగాయి. క్రమంగా ఆలయం పక్కనే వున్న వేప చెట్టుకు వ్యాపించాయి. చెట్టు కాలిపోతుండగా స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో కడప అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పి వేసినట్లు అగ్నిమాపక శాఖ అధికారి బసివిరెడ్డి తెలిపారు. అయితే అప్పటికే చెట్టు దాదాపుగా కాలిపోయింది.

ఇద్దరు యువతుల అదృశ్యం


మానస (ఫైల్)

స్పందన (ఫైల్)

ముద్దనూరు : మండలంలో వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు అమ్మాయిలు అదృశ్యమైనట్లు స్థానిక పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ నరేష్‌బాబు సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని యామవరం గ్రామానికి చెందిన మానస(19) జమ్మలమడుగులో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 12వ తేదీన ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె తల్లి సునంద పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముద్దనూరులోని ఎస్వీగిరి కాలనీకి చెంది న స్పందన (17) ఈ నెల 12వ తేదీన మధ్యాహ్నం ఇంటి వద్ద నుంచి అంగడికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. స్పందన తల్లి నాగలక్షుమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆకట్టుకున్న హనుమాన్ శోభాయాత్ర



సీతారామలక్ష్మణ హనుమ వేషధారణలో చిన్నారులు, హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

మైదుకూరు : మైదుకూరులో రాష్ట్ర సేవికా సమితి ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో హనుమాన్ శోభాయాత్రను కన్నుల పండువగా నిర్వహించారు. ఆదివారం జరిగే హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం సాయంత్రం ఈ కార్యక్రమం చేపట్టారు. స్థానిక వనిపెంట రోడ్డులోని అంకాలమ్మ దేవాలయం ఆవరణ నుంచి దాదాపు 400 బైకులతో పెద్ద సంఖ్యలో హనుమాన్ భక్తులు, మహిళలు, పిల్లలతో పట్టణంలోని నాలుగు రోడ్ల వెంట శోభాయాత్ర నిర్వహించారు. అడుగడుగునా జై భజరంగి, జై శ్రీరామ్ నినాదాలతో పట్టణ ప్రధాన రహదారులు హోరెత్తాయి. జై హనుమాన్, జై శ్రీరామ్ పతకాలను చేత బూని భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో చిన్నారులు ప్రదర్శించిన ఝాన్సీ లక్ష్మీబాయి, స్వామి వివేకానంద, సీతా, రామ, లక్ష్మణ, హనుమ వేషధారణలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు అంకాలమ్మ దేవాలయంలో జరిగిన బహిరంగ సభలో ఆర్ఎస్ఎస్ విభాగ బౌద్ధిక్ ప్రముఖ్ బలరాంజీ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని ఆచరిస్తూ ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు తమిదేపాటి వెంకటేశ్వర్లు, పాశం అనిల్, రాష్ట్ర సేవిక సమితి నాయకులు మలిపెద్దు హరినాథ్, పందిటి పెద్దయ్య, రామ్ నాయక్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ సమీపంలో వున్న యూనియన్ బ్యాంక్‌లో ఈ నెల 8వ తేదీన ఆధార్‌కార్డులో సెల్‌ఫోన్ నంబర్‌ను అప్‌డేట్ చేయించుకోవడానికి వెళ్లిన పి.వెంకట శివకుమార్ (53)పై.. బ్యాంకు ఉద్యోగి విశ్వనాథ్ ప్రింటర్‌తో తలపై కొట్టి గాయపరిచాడు. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు... పి.వెంకటశివకుమార్ కరూర్ వైశ్యాబ్యాంక్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ వీఆర్ఎస్ తీసుకున్నారు. ఆయన ప్రస్తుతం తన భార్య, పిల్లలతో వివేకానందనగర్‌లో వుంటున్నారు. ఆయన తన భార్యతో కలిసి సోమవారం (8వ తేదీన) ఆధార్‌కార్డులో సెల్‌నంబర్ అప్‌డేట్ కోసం వెళ్లారు. అక్కడ పని చేస్తున్న అశ్విని అనే ఉద్యోగిని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో బాధితుడు వారి మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. అశ్విని తరఫున విశ్వనాథ్ అనే ఉద్యోగి వత్తాసు పలుకుతూ వెంకట శివకుమార్‌పై ప్రింటర్‌తో దాడి చేశాడు. బాధితుడి నుదుటి భాగంపై గాయమవడంతో ఆయన రిమ్స్‌లో చేరారు. వైద్య సేవలను పొందిన తరువాత శనివారం కడప ఒన్‌టౌన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ రంగస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.